
మనపాళెం వద్ద ముందుకొచ్చిన సముద్రం

అక్కడ ముందుకు.. ఇక్కడ వెనక్కి

● సముద్రతీరంలో విచిత్ర పరిస్థితి

తూర్పు సముద్రతీరంలో విచిత్ర పరిస్థితులు నెలకొనడంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. ఉన్నట్టుండి గురువారం 15 మీటర్లు వెనక్కివెళ్లింది. దీనికి భిన్నంగా.. ఇక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలోని మనపాళెం వద్ద సముద్రం 5 మీటర్లు ముందుకు వచ్చింది. ఈ విచిత్ర పరిస్థితుల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

మనవడా.. ఎక్కడున్నావురా

కనిపించిన వారికంతా చేతిలో కరపత్రం చూపుతోంది. అందులోని ఫొటో చూపించి మీకేమైనా కనిపించాడా అని అడుగుతోంది. ఇలా మతిస్థిమితంలేని మనవడి కోసం అమ్మమ్మ చెల్లమ్మ.. ఊరూవాడా తిరుగుతోంది. సూళ్లూరుపేట మండలం మాంబట్టుకు చెందిన నెల్లూరు దిలీప్(21) వినాయకచవితి నాడు సూళ్లూరుపేట బస్టాండ్‌లో తప్పిపోయాడు. మతిస్థిమితం లేని దిలీప్ ఎటు వెళ్లాడో తెలియక తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్య కరపత్రాలు పట్టుకొని ఊరూరా తిరుగుతున్నారు. ఇలా చెల్లమ్మ గురువారం ఉదయం చిట్టమూరు మండలం కొత్తగుంట సెంటర్లో టీ దుకాణం వద్ద కరపత్రం చూపుతూ మనవడి ఆచూకీ కోసం అభ్యర్థించింది.

- చిట్టమూరు, ఆంధ్రజ్యోతి



కొత్త టీచర్లకు కౌన్సెలింగ్ చిక్కులు

● ఎస్జీటీలకు మాన్యువల్, ఎస్ఏలకు వెబ్ కౌన్సెలింగ్
● రాత్రి వేళ తిరుపతిలో అయ్యోర్ల పడిగాపులు


తిరుపతిలో అభ్యర్థుల నుంచి ఆప్షన్ ఫామ్ తీసుకుంటున్న ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి (విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించబోయే వారికి కౌన్సెలింగు ప్రారంభంలో చిక్కులు ఎదురయ్యాయి.సెకండరీ గ్రేడ్ టీచర్లు పోస్టింగ్ కౌన్సెలింగు కోసం తిరుపతిలో గురువారం రాత్రి పడిగాపులు కాయాల్సి వచ్చింది.డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1403మంది ఉద్యోగం పొందారు. వీరిలో 1394 మంది ఈనెల 3నుంచి చిత్తూరు, తిరుపతి కేంద్రాల్లో శిక్షణా తరగతులకు హాజరు కాగా, తొమ్మిదిమంది గైర్హాజరయ్యారు.తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు గురువారం రాత్రి 11గంటల తరువాత మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఆర్జేడీ శామ్యూల్, తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, చిత్తూరు డీఈవో బి.వరలక్ష్మి కౌన్సిలింగ్‌ను పర్యవేక్షించారు. ఒకటినుంచి 250వ ంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగు పూర్తి చేస్తారు.శుక్రవారం 251నుంచి 700వరకూ తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని మెడ్ స్కూల్లో, 701నుంచి 922వరకూ గూడూరులోని ఆదిశంకరా ఇంజనీరింగు కళాశాలలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.కాగా కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారంతో శిక్షణ తరగతులు ముగియనున్నాయి. గురు,శుక్రవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తారు.వీరంతా సోమవారం విధుల్లో చేరాల్సి ఉంది.పాఠశాల కేటాయింపుల కౌన్సెలింగ్ ప్రక్రియలో గురువారం గందరగోళం నెలకొంది. 917 మంది ఎస్జీటీ అభ్యర్థులకు బుధవారం నుంచి తొలుత వెబ్ కౌన్సెలింగ్ అంటూ చెప్పిన అధికారులు, గురువారం సాయంత్రానికి ఆ ప్రక్రియను మాన్యువల్‌గా మార్చారు. స్కూల్ అసిస్టెంట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ అంటూ చివరికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఇందుకు సంబంధించి ఎస్ఏలకు ఖాళీలను ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.

పూర్తి ఖాళీలు చూపని వైనం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించారు. కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ జాబితా ఆధారంగా, ఉపాధ్యాయులు స్థానాలు కోరుకుని విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యాశాఖలో క్లియర్ వేకెన్సీలు వచ్చేశాయి. అయితే కొత్తగా వచ్చే ఉపాధ్యాయులకు క్లియర్ వేకెన్సీలు పూర్తిగా చూపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఆర్‌కే ఒకటి, రెండు కేటగిరీల ఖాళీలు చూపకుండా, కేవలం హెచ్‌ఆర్‌కే మూడు, నాలుగు కేటగిరీల వేకెన్సీలు చూపుతున్నారు. దీంతో కొత్త ఉపాధ్యాయులకు మండల స్థాయి, మారుమూల గ్రామీణ ప్రాంత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి.1394మంది ఉపాధ్యాయులకు 1:1 ఖాళీలు మాత్రమే చూపుతున్నారు. అంటే 1394 స్థానాలనే వేకెన్సీలుగా చూపుతున్నారు. కాగా ఒకటి రెండు కేటగిరిలైన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ఏకంగా 500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించినా, వీటిని కౌన్సెలింగ్‌లో చూపకపోవడంపై విమర్శలు వచ్చాయి.

రాత్రి 11.30 గంటలకు మొదలైన కౌన్సెలింగ్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొత్తగా ఎంపికైన 917మంది ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం రాత్రి 11.30 గంటలకు తిరుపతిలో మొదలైంది. వాస్తవానికి సాయంత్రం 5 గంటలకు మొదలు పెట్టి రాత్రి 11 గంటలకు ముగించాలని రాష్ట్రస్థాయి అధికారులు సూచించారు. మరో వైపు ఖాళీల జాబితా ప్రచురించడంలోనూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించడం ఉపాధ్యాయుల్ని నిరాశకు గురిచేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తంగా 917మంది ఉన్నారు. ఎస్జీటీ (తెలుగు)లో 753మంది మండల పరిషత్ స్థాయిలో ఎంపిక కాగా, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 75మంది, మున్సిపాలిటీ పరిధిలో 53మంది, ఎస్జీటీ (ఉర్దూ)లో ఎంపీపీ స్థాయిలో 30మంది, మున్సిపాలిటీలో ఒకరు, ఎస్జీటీ (తమిళం)లో ఎంపీపీ పరిధిలో ఎంపికైన ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారు.


గురువారం రాత్రి జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

బీఎడ్.. వెరీ డిమాండ్

● 'పద్మావతి' వర్సిటీ దూరవిద్యలో
500 సీట్లకు 2,500 మంది హాజరు


బీఎడ్ కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఇన్ సర్వీసు బీఎడ్ కోర్సుకు డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగులు పదోన్నతుల కోసం రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. 2019 వరకు ఇయర్లీ పాట్రెన్ పరీక్షలతో ఈ కోర్సు నిర్వహించేవారు. అయితే, డిస్టెన్స్ ఎడ్యుకేషనన్ బోర్డు (డెబ్) సెమిస్టర్ విధానంలో ఈ కోర్సు నిర్వహించాలనే నిబంధన పెట్టింది. దీంతో 2019 తర్వాత ఈ కోర్సు కొనసాగలేదు. సెమిస్టర్ విధానానికి అవసరమైన సిలబస్ రూపకల్పన, ఇతర ఏర్పాట్లు చేయడంతో కోర్సు నిర్వహణకు డెబ్ అనుమతించింది. ఆ యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో గురువారం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. 500 సీట్లకు ఏకంగా 2,500 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసినట్లు దూరవిద్యా విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.

జేసీ శుభమ్ బన్సల్ బదిలీ

● పరిశ్రమల డైరెక్టర్‌గా కీలక పోస్టింగ్



తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయన పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జూనియర్ అధికారి అయినప్పటికీ చాలా కీలక పోస్టింగ్ అందుకున్నారు. గతేడాది జూలై 24న జేసీగా బాధ్యతలు తీసుకున్న ఈయన ప్రజలతో, ప్రజాప్రతినిధులతో పెద్దగా మమేకం కాలేకపోయారు. భూసేకరణ, ఇతర భూ అంశాలకు సంబంధించి తొందరపడి ఫైళ్లు క్లియర్ చేస్తే వివాదాల్లో చిక్కుకుంటామేమోనన్న అనుమానంతో జాప్యం చేయడంతో పెండింగ్ పడుతూ వచ్చాయి. అదే సమయంలో జిల్లాలో పారిశ్రామిక, జాతీయ రహదారులపరంగా భూసేకరణ విషయాల్లో చురుగ్గా పనిచేశారు. పారిశ్రామికంగా జిల్లా కీలక స్థానంలో ఉన్న నేపథ్యంలో జేసీగా శుభమ్ బన్సల్ పనితీరును, ఆయన అవగాహనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కీలకమైన పరిశ్రమల శాఖకు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. గతంలోనే నియమించాలని ప్రయత్నించినా జిల్లాలో ఆయన అవసరం ఉందంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అభ్యర్థించడంతో ఆ ప్రతిపాదనను విరమించుకుంది. కాగా, జిల్లాకు ఎవరినీ జేసీగా నియమించలేదు.

రుయా.. ఏందయా!

● అత్యవసర విభాగంలో ఒకే పడకపై ఇద్దరేసి రోగులకు వైద్యం
● ఆరు బయట సహాయకులకు తిప్పలు


అత్యవసర వార్డులో ఒకే పడకపై ఇద్దరికి చికిత్స

పేదల ఆస్పత్రిగా పేరున్న రుయాను.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా హోదా పెంచారు. అందుకు తగ్గ వైద్యులను నియమించారు. కానీ, పెరుగుతున్న రోగులకు సరిపడా వసతులను, పడకలను పెంచలేదు. దీంతో ఆస్పత్రి లోపల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అత్యవసర విభాగంలో 30 పడకలే ఉన్నాయి. రోగులకు సరిపోక ఒకే పడకపై ఇద్దరేసి అవసరమైతే ముగ్గురికి కూడా వైద్యం చేయాల్సిన పరిస్థితి. ఇక, చికిత్స పొందుతున్న వారికి సాయంగా వచ్చే సహాయకులు వేచి ఉండేందుకు భవనం లేదు. కనీసం భోజనం చేసేందుకు కూడా సరైన ప్రదేశం లేదు. దీంతో ప్లాట్‌ఫారంపైన, పార్కింగ్ ప్రదేశాల్లో సేద తీరుతూ, రోడ్డు పక్కనే భోజనం చేస్తూ అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఏ చెట్టు కనిపిస్తే అక్కడకు పరుగులు తీసి తలదాచుకోవాల్సి వస్తుంది. ప్రధానంగా చిన్నపిల్లలతో వచ్చే సహాయకులు, వృద్ధులు పడే అవస్థలు వర్ణనాతీతం. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఏడాది ముందు వరకు రోజుకు ఓపీ కేసులు: 1000-1200
అత్యవసర కేసులు: దాదాపు 200
ఇప్పుడు ఓపీలు: 1800-2000
అత్యవసర కేసులు: 500




షెల్టర్ లేక రోగుల సహాయకుల అవస్థలు - రోడ్డు పక్కనే భోజనం చేస్తూ..

నేడు ఎస్వీయూ కొత్త వీసీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ నరసింగరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాదు నుంచీ ఉదయం తిరుపతికి చేరుకుని, ఓ అధికారిక ఆన్‌లైన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. ఆ తర్వాత వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను రిజిస్ట్రార్ భూపతి నాయుడు నేతృత్వంలోని అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

ముక్కంటి ఆలయ భద్రతపై దృష్టి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ భద్రత పటిష్టతపై ఈవో బాపిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. 'ముక్కంటి ఆలయంలోకి నాగశిలలు' తేవడంపై గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంపై స్పందించిన ఈవో.. భద్రతా సిబ్బందిని వివరణ అడిగారు. సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.

ఏం జరుగుతోంది?

● రెండు రోజులుగా డ్యూయాంగన్‌ను విచారిస్తున్న ఈడీ అధికారులు
● కీలక రికార్డులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒప్పంద కాంట్రారుగా ఓ పరిశ్రమలో పనిచేసేందుకు చైనా నుంచి డ్యూయాంగన్ వచ్చాడు. వీసా గడువు ముగిసినా వెళ్లలేదు. బెయిల్‌పై బయట ఉంటూ అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. ఇతడి ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాదు ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ నేతృత్వంలో పది మంది అధికారులు బుధవారం ఉదయం రేణిగుంట మండలం గురవరాజుపల్లెలోని అతడి ఇంట్లో సోదాలు మొదలు పెట్టారు. అప్పట్నుంచి డ్యూయాంగన్‌ను అదుపులోకి తీసుకుని గురువారం కూడా సోదాలు, విచారణ కొనసాగించారు. బిగ్ కిచెన్ పేరుతో చైనా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతడు ఆహారం సరఫరా చేస్తున్నాడు. వివిధ చైనా కంపెనీల నుంచి స్క్రాబ్ కొని వ్యాపారం చేస్తున్నాడు. కొంతమంది చైనీయులు, స్నేహితుల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. మూడేళ్ళుగా వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండటం, పన్నులు చెల్లించకుండా, వివిధ కంపెనీల పేరుతో వ్యాపారాలు నిర్వహించడం, హవాలా రూపంలో డబ్బు దేశం దాటిస్తున్నాడంటూ వచ్చిన ఫిర్యాదులపై ఈడీ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా, గురువారం ఏర్పేడు మండలం వికృతమాలలో ఇతడి స్క్రాబ్ గోడౌన్లలోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ రికార్డులు, కొన్ని రసీదులు, బిల్లు పుస్తకాలు, రవాణా.. వే బిల్లులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక, డ్యూయాంగన్‌కు అకౌంట్లున్న బ్యాంకులకు సంబంధించి కొందరు అధికారులను పిలిపించి విచారించినట్లు తెలిసింది. అతడి బ్యాంకు పాసుపుస్తకాలు, చెక్‌లు, మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. బ్యాంకు అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారు. కాగా, బ్యాంకు లావాదేవీలపై శుక్రవారం తనిఖీలు చేస్తారని సమాచారం.


డ్యూయాంగన్ ఉండే భవనం

సదరన్ డిస్కం సీఎండీగా శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం సీఎండీగా లోతేటి శివశంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఎండీ కె.సంతోషరావు రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉన్నారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, సీఎండీగా నియమితులైన శివశంకర్, గతంలో కడప కలెక్టర్‌గా పనిచేసే సమయంలో ఐఏఎస్‌ల విభజన జరిగింది. అప్పట్లో తెంగాణకు బదిలీ అయ్యారు. సొంత రాష్ట్రంలో సేవలందించాలన్న సంకల్పంతో క్యాట్, న్యాయస్థానాలను ఆశ్రయించి తిరిగి ఏపీకి కేటాయించుకున్నారు. గతంలో పాడేరు సబ్ కలెక్టర్‌గాను, ఐటీడీఏ పీవోగాను పనిచేశారు. అనంతరం పల్నాడు తొలి కలెక్టర్‌గా పనిచేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శివశంకర్‌ది విజయనగరం జిల్లా ధర్మవరం. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఏసీటీవోగా పనిచేస్తూ ఐఏఎస్ అయ్యారు.

12 నుంచి కోదండరామాలయంలో పవిత్రోత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 11న సాయంత్రం 6 గటలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గృహస్తులు(ఇద్దరు) రూ.200 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. ఒక పవిత్రం, స్వామివారి తీర్థ ప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు.

నేటి నుంచి ఎంబీయూలో మోహనమంత్ర

చంద్రగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నుంచి మోహనమంత్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు ప్రధాన పోషకుడిగా, ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు ప్రధాన పాత్ర పోషించనున్నారు. అధ్యక్షులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామరావ్, చీఫ్ గ్రోత్, స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ సారథి వ్యవహరిస్తున్నారు.

పూడిపోయిన మురుగు కాలువ



పాకాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ న్యూకాలనీలో సిమెంటు రోడ్డు కుంగిపోయి మురుగుకాలువ పూడిపోయింది. దీంతో నీరు పారకుండా నిలిచిపోయాయి. పార్కువీధిలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా న్యూకాలనీకి వెళ్లే ఈ రోడ్డుపై ఇటీవల ట్రాక్టర్లు వెళుతుండటంతో కుంగిపోయింది. ఆ శిథిలాలు పడి కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయింది. నెల రోజులవుతున్నా పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలతో పరిసర వాసులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూతపడిన పాఠశాల

● నిరుపయోగంగా భవనాలు



పాకాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంలో మండలంలోని కుందేటివారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మొదటి దశలో ఎంపిక చేశారు. తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, లైట్లు, డెస్క్‌లు, గ్రీన్ బోర్డు, డిజిటల్ బోధన కోసం ఎల్‌ఈడీ టీవీ, తరగతి గదుల ముందు పార్కింగ్ టైల్స్, కిచెన్ షెడ్డు, హ్యాండ్ వాష్, ఆధునిక టాయ్‌లెట్స్, నీటి సంపు, మోటారు, ఓవర్‌హెడ్ ట్యాంకు, స్టేజి నిర్మించారు. సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మించి, గేటు ఏర్పాటు చేశారు. పాఠశాల మొత్తం పెయింటింగ్ చేసి, ఆధునిక వసతులతో ఉన్న ఈ పాఠశాల నేడు విద్యార్థులు లేక మూతపడింది. భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా మండల అధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

పాలమిత్ర సభ్యులకు మిక్సీల పంపిణీ



ఎర్రావారిపాలెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉదయమాణిక్యం, ఎర్రావారిపాలెం బల్క్ మిల్క్ కేంద్రాల్లోని పాలమిత్ర సభ్యులకు, శ్రీజ మహిళా పాల ఉత్పత్తిదారులకు దీపావళి కానుకగా గురువారం మిక్సీలు పంపిణీ చేసినట్లు శ్రీజ కంపెనీ భాకరాపేట ఏరియా మేనేజర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. వర్షాకాలం పశువులకు సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యల గురించి సంస్థ పశువైద్యాధికారి రైతులకు వివరించారు. సంస్థ పీబీఐ అధికారి కేశవ మాట్లాడుతూ జైకా సంస్థ సహకారంతో పాడి రైతుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చిరంజీవి, దిలీప్. శివప్రసాద్, చరణ్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో బహుళ ప్రయోజనాలు



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు సచివాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ వల్ల నిత్యావసరాల ధరలు తగ్గి పేదలకు ఆదాయం సమకూరుతోందన్నారు. ప్రస్తుతం వస్తువులపై రెండు స్లాబుల్లోనే పన్నులు విధిస్తున్నారని తెలిపారు. నిత్యావసరాలు, మందులు, డైరీ ఉత్పత్తులు, శానిటరీ ప్యాడ్‌ల వంటి ధరలు తగ్గాయన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, కార్యదర్శి వెంకటేశులు, వీఆర్వో మస్తాన్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

భాకరాపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మృదులాదేవి అన్నారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోర్ సంసథ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు. యువత సత్ప్రవర్తన కలిగి, ఆరోగ్యవంతమైన జీవన విధానమే లక్ష్యంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రగిరి

సాయినగర్ స్కూల్ సందర్శన



టాయిలెట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంఈవో

తిరుపతిరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో-2 శంకరయ్యతో కలసి ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి సందర్శించారు. విద్యాపరమైన అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. టాయిలెట్లను పరిశీలించారు. కాగా పాఠశాలలో 1-నుంచి 5 తరగతులకు సంబంధించి 74 మంది విద్యార్థులు చదువుతున్నారని, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని హెచ్ఎం కోరారు. మండల పరిషత్ లేదా జెడ్పీ నిధుల మంజూరుకు కృషి చేస్తామని వారు చెప్పారు. ఇదే స్కూల్ ప్రాంగణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే బాలామృతం, రాగిజావ ప్యాకెట్లను పరిశీలించారు.

అనధికార హోటల్ లీజు రద్దు చేయండి

● సీఎంకు విన్నవించిన డాక్టర్ కోడూరు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుపతి కపిలతీర్థం వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ మెరిడియన్ హోటల్ లీజును రద్దు చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం గురువారం సీఎం నారా చంద్రబాబు నాయుడికి విన్నవించారు. గురువారం సచివాలయంలో కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు వ్యక్తులకు 99 సంవత్సరాలపాటు లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరారు. లీజును రద్దు చేసి ఆ ప్రాంతంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజులుగా తనపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకునేలా ఎస్పీకి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన దివాకర్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ చిన్నగోవింద వివరాల మేరకు... తిరుపతి నగరం ఉప్పొంగి హరిజనవాడకు చెందిన దివాకర్(19) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. బుధవారం సొంత పని మీద ద్విచక్ర వాహనంలో చంద్రగిరికి వెళ్లాడు. పని ముగించుకుని బంధువు జశ్వంత్‌తో కలిసి వస్తుండగా రామానుజపల్లి సమీపంలో చంద్రగిరి వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో 108లో రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దివాకర్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సంఘం రజతోత్సవం

పాకాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రజతోత్సవం నిర్వహించనున్నట్లు పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు (పెన్షనర్లు) అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాలుజారి మరుగుదొడ్డిలో పడ్డ విద్యార్థి

● కడుపులో నుంచి బయట పడ్డ పేగులు



ప్రదీప్

చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి మరుగుదొడ్డిలో కాలు జారి పడటంతో కడుపులో నుంచి పేగులు బయట పడ్డ సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బూటకపల్లెకు చెందిన మల్లిఖార్జున కుమారుడు ప్రదీప్(8) అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. స్కూల్ పక్కనే ఉన్న ఓ ఇంట్లో అయప్పస్వామి పూజ జరుగుతుండగా ప్రదీప్ చూసేందుకు మరుగుదొడ్డిలోకి వెళ్లి చూసేందుకు ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో జారిపడిన విద్యార్థికి విరిగిన పింగాని పెంకులు గుచ్చుకున్నాయి. కేకలు విన్న ఉపాధ్యాయులు గుర్తించి దాదేపల్లెలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌లో చికిత్సలు అందించారు. కడుపులోనుంచి పేగులు బయటకు వచ్చాయని గుర్తించి ద్విచక్రవాహనంలోనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించి మదనపల్లె ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



సీఎస్ వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన వర్చువల్ విధానంలో అధికారులతో చర్చించారు. గతేడాది పలు హాస్టళ్లలో అపరిశుభ్ర వాతావరణంతో చిన్నారులు అస్వస్థతకు గురయ్యారని గుర్తుచేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. హాస్టళ్ల సమీపంలో ఏవైనా శుభకార్యాలు జరిగిన మిగిలిన భోజనం పిల్లలకు అందకుండా చూడాలన్నారు. నీటి శుద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కేవీఎస్ కుమార్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎస్ సమీక్ష: సానుకూల ప్రజాదృక్పథం, సీజనల్ వ్యాధులు, ఆస్పత్రులకు మందుల పంపిణీ, పింఛన్ల పునఃపరిశీలన వంటి పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో వర్చువల్‌గా సమీక్షించారు. సానుకూల ప్రజాదృక్పథంలో జిల్లా వెనుకబడి ఉంది సీఎస్ అడిగారు. అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ తెలిపారు. పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేయని వైద్య పరికరాలకు సర్వీసింగ్ చేయించాలని ఆదేశించారు.

టీటీడీ ఉద్యోగి ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నివాసమున్న టీటీడీ ఉద్యోగి ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. మారుతి నగర్‌లో కాపురమున్న విజయకుమార్ టీటీడీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబంతో కలసి రెండు రోజుల క్రితం బంధువుల శుభకార్యం కోసం ఊరెళ్లారు.ఈ క్రమంలో దుండగులు ఇంటి తాళాలు పగులకొట్టారు. ఇంట్లోని బీరువాలో ఉన్న 20తులాల బంగారు నగలు,కిలో వెండి అపహరించుకొని వెళ్లారు.ఇంటికి వచ్చాక చోరీ జరిగినట్లు తెలిసి.. బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

డ్రోన్‌తో జూదరులను పట్టేశారు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంపై అలా ఎగురుతున్న పోలీస్ డ్రోన్.. ఓ ఇంటి మిద్దెపై పేకాట ఆడుతున్న వారికి క్లిక్‌మనిపించింది. డ్రోన్ కెమెరాల ద్వారా గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, రూ.37 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వారు.. వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో కోరారు. ప్రజల సహకారంతోనే నేర రహిత సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

తిరుపతి(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నేతలు తెలిపారు. ఈ మేరకు సంఘ ఆధ్వర్యంలో గురువారం అర్బన్ మండల విద్యాధికారి భాస్కర్‌నాయక్‌ని కలసి వినతిపత్రం సమర్పించారు. సభ్యులు భీమినేని మునికృష్ణనాయుడు, మధుసూదన్‌రెడ్డి, మురళీకృష్ణ, శ్రీనివాసన్, హేమాద్రి, ఖాదర్‌బాషా, రేణుకాదేవి, ద్రాక్షాయణి, మోహన్, మురళి, శాంతకుమారి, మల్లికార్జున్, మనోహర్, అగస్టీన్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం),అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) కల్తీ మద్యం తయారీకి వ్యతిరేకంగా వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.విధులకు భంగం కలిగించారని ఎక్సైజ్ సీఐ రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు అలిపిరి ఎస్ఐ అజిత చెప్పారు.

రామగిరిలో కొండ చిలువ హల్‌చల్



పిచ్చాటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రామగిరి దళితవాడ గ్రామ సమీపంలో పీడబ్ల్యు కాలువ ఉంది. జనావాసానికి ఆనుకుని ఉన్న కాలువ పక్కన ఓ కొండ చిలువ కోళ్లను పట్టుకుంది. ఈ ఘటన చూసిన గ్రామస్తులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కొండ చిలువను పట్టుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై విమానాశ్రయ భద్రతా సిబ్బందికి అవగాహన

రేణిగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విమానాశ్రయ భద్రతా సిబ్బందికి గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గురువారం మధ్యాహ్నం విమానాశ్రయం సమీపంలోని పవనంలో విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందికి డిజిటల్ అరెస్టు, పెట్టుబడి, ఓటీపీ లోన్స్ యాప్స్, హనీట్రాప్, సైబర్ నేరాల పట్ల సీఐ అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ ప్రవల్లిక, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు రాజు, ధన, విమానాశ్రయ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

హిడెన్ కెమెరా పెట్టిన ఇంజనీరుపై కేసు

చిత్తూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు సమీపంలోని ఓ యూనివర్సిటీలో ఇటీవల గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా పెట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో గురువారం 'గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా కలకలం' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్పీ తుషార్ డూడి స్పందించారు.పోలీసులను గురువారం యూనివర్సిటీకి పంపారు. జరిగిన ఘటనపై విద్యార్థులను, అధ్యాపకులను వారు విచారించారు.కెమెరా అమర్చిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం టాయిలెట్‌లో ఉంచి వీడియో చిత్రీకరణకు ఉపయోగించిన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అందులోని వీడియోలు, డేటాను అప్పటికే డిలీట్ చేసి వుండడంతో రికవరీకి పంపించినట్లు పోలీసులు వివరించారు. టాయిలెట్‌లో హిడెన్ కెమెరా పెట్టిన కందరూబెన్(27)పై చిత్తూరు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు.యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులకు సైట్ ఇంజనీరుగా ఇతడు పనిచేస్తున్నాడు.తమిళనాడు రాష్ట్రం రాజపాళయం తాలుకా, తంగలింగాపురం గ్రామానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు.

వైసీపీ దాడిలో టీడీపీ నేతకు గాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న ఉమా మహేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌లో గురువారం వైసీపీ నేతలు టీడీపీ నేతపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ఇందిరానగర్ 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సుబ్బయ్య మనవడు ఉమా మహేశ్వర్, అదే ప్రాంతానికి చెందిన వైసీపీ కార్యకర్త ధనుష్ స్నేహితులు. వీరి మధ్య బుధవారం గొడవ జరిగింది. ఇంతలో గాంధీపురానికి చెందిన 17వ డివిజన్ వైసీపీ నేతలు నల్లాని బన్నీ, భరత్, మహేష్, ధనుష్, ప్రభాష్, మురుగేష్ అక్కడికి వచ్చి ఉమామహేశ్వర్‌పై కర్రలతో దాడి చేశారు. ఉమామహేశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జశ్వంత్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... బాలాయపల్లి మండలం గొట్టికాడుకు చెందిన జశ్వంత్(23) గూడూరులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గొట్టికాడు నుంచి బైక్‌పై గూడూరుకు వస్తుండగా వెందోడు సమీపంలో మరో ద్విచక్ర వాహనం వేగంగా వస్తూ ఢీకొంది. ఈ సంఘటనలో జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా ఎదురుగా వచ్చి ఢీకొన్న మరో ద్విచక్ర వాహనదారుడు శీనయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. జశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. విద్య, కథలు, సాహిత్యం వంటి రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య తెలిపారు. ఈ 12న తిరుపతి మహతి కళా క్షేత్రంలో జరిగే వే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు అందజేస్తామని తెలిపారు.

కేవీ పల్లెలో దారుణం



● చెల్లెలిపై అన్న అఘాయిత్యం

● మగబిడ్డకు జన్మనిచ్చిన బాలిక

పీలేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికీ అంతరించిపోతున్న నైతిక విలువలకు అద్దం పట్టే సంఘటన గురువారం పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలంలో వెలుగు చూసింది. సోదరి బాగోగులు చూసుకోవాల్సిన సోదరుడు కామంతో కళ్లు మూసుకుపోయి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చడమే కాకుండా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందన్న భయంతో పుట్టిన బిడ్డను వదిలించుకోవాలని బంధువులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి ఈ విషయం బయటకు పొక్కింది. కేవీ పల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) తండ్రికి పక్షవాతం సోకి కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణార్థం బాలిక తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న ఆ బాలికపై ఆమె పెద్దనాన్న కుమారుడు కన్నేశాడు. కొంతకాలంగా ఆమెను లొంగదీసుకుని ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చింది. ఆమె శరీరంలో జరిగిన మార్పులను గమనించిన సమీప బంధువులు ఆమెను మూడు రోజుల క్రితం పీలేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యురాలి వద్దకు తీసుకెళ్లడంతో బాలిక గర్భంతో ఉన్న విషయం తెలిసింది. బాలికను గట్టిగా అడగడంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని వారికి వివరించింది. ఇక చేసేది లేక వారు ఆ విషయాన్ని గ్రామంలోని పెద్ద మనుషులకు తెలియజేశారు. అదే సమయంలో బాలికకు కాన్పు చేయాలని వైద్యురాలిని అభ్యర్థించడంతో ఆమె ఆ బాలికను తన ఆసుపత్రిలో జాయిన్ చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆ బాలిక సోదరుడు గ్రామం నుంచి ఉడాయించాడు. అతని తరపు వారు ఆసుపత్రికి చేరుకుని బాలిక వద్ద ఉన్న వారితో మంతనాలు ప్రారంభించారు. పుట్టిన బిడ్డను పీలేరులోనే వదిలించుకోవాలని,బాలిక ఆలనా పాలనా తాము చూసుకుంటామని నమ్మబలికారు. అందరూ సమ్మతించి ప్రసవం అయిన తరువాత గ్రామంలోని కులపెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకోవచ్చునని తీర్మానించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక బుధవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం కావడం, పీలేరులో ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బిడ్డతో పాటు బాలికను గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసుకుని వెళ్లిపోయారు. వెళ్లిపోయే సమయంలో పుట్టిన బిడ్డను ఎవరికైనా ఇచ్చేయాలని కొంతమందితో సంప్రదింపులు చేస్తుండడంతో ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో వారు అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అటు పోలీసులకు, ఇటు ఐసీడీఎస్ అధికారులకు సైతం సమాచారం లేకపోవడం కొసమెరుపు. ఇటువంటి సంఘటనల్లో కాసింత ముందుగా స్పందించాల్సిన ఐసీడీఎస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవడం విశేషం. తీరా గురువారం సాయంత్రం స్పందించిన ఐసీడీఎస్ అధికారులు బసన్నగారిపల్లెలోని బాలిక స్వగృహం, పీలేరులోని ప్రైవేటు ఆసుపత్రిలో విచారణ చేపట్టి కాన్పు జరిగిన విషయం నిజమేనని నిర్ధారించారు. బాలికకు కాన్పు చేసిన ప్రైవేటు ఆసుపత్రిపై పీలేరులోని పలు ప్రజాసంఘాలు మండిపడ్డాయి. మైనర్ బాలిక కాన్పు కోసం వచ్చినప్పుడు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం, కాన్పు అయిన తరువాత కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడంపై వారు ధ్వజమెత్తారు. అంతేకాకుండా బిడ్డను ఇతరులకు అప్పగించేలా ఆసుపత్రి నిర్వాహకులు మంతనాలు సాగించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ ఆరోపించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదరం పరీక్షల్లో నిబంధనలు పాటించండి

కమిషనర్ మౌర్య

తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సదరం ధ్రువపత్రాల కోసం నిర్వహించే పరీక్షలు పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య వైద్యులకు సూచించారు. వికలత్వ శాతాన్ని నిర్ధారిస్తూ రుయాసుపత్రిలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను గురువారం ఉదయం ఆమె తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వైద్యులు అందించే సదరం ధ్రువపత్రాల మేరకు వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని, ఇందులో ఎటువంటి అవకతవకలూ లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

9 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్మగ్లర్ అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుల్లంపేట వద్ద గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున ఎం.బావి ఫారెస్టు బీటు పరిధిలో రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అన్నమయ్య జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నిరసన

తిరుపతి(జీవకోన), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన కేసులో నిందితులపై చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని వైసీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు చేజర్ల మురళి, నాయకులు మద్దాలి శేఖర్, వాసుదేవ యాదవ్, రమణ, గీతాయాదవ్ పాల్గొన్నారు.

వీసీల నియామకంలో రజకులకు చోటు హర్షణీయం

తిరుపతి(జీవకోన), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకాల్లో రజక సామాజిక వర్గానికి చోటు కల్పించడంపై రజక సంఘం నేత అక్కినపల్లి లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ వెంకట సుబ్బారావును విజయనగరం గురజాడ యూనివర్సిటీ వీసీగా నియమించడం సంతోషం కలిగించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ బాబుకు అవార్డు


బాబును సన్మానిస్తున్న ప్రతినిధులు

తిరుపతి(విద్య), అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన ఎం.బాబుకు గురుతేజం జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన 30 ఏళ్లుగా చేసిన విశేష సేవలకు గుర్తింపుగా గురువారం చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఉషోదయ ఫౌండేషన్, ఎం.వి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్, తెలుగు కళారత్నాల సాంస్కృతిక సేవా సంస్థ, ఏపీ జూనియర్ చాంబర్ ఇంటర్నేషన్ ఇండియా ప్రతినిధులు ఆయన్ను సన్మానించి, అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, వి.రత్నం, శ్రీధర్ రెడ్డి, ఉషారాణి పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత ఎస్వీయూ కాలేజీ


సాఫ్ట్‌బాల్ విజేత ఎస్వీయూ జట్టు

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ మైదానంలో గురువారం నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. తుదిపోరులో ఎస్వీయూ కాలేజీ, పీవీకేఎన్ చిత్తూరు డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ, మెడల్ అందించారు. క్రీడాకారులను అభినందించారు.

ఎస్పీ కార్యాలయంలో 'ప్రత్యేక సేవ'


బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీన జనసేవ సమితి సొసైటీ ఫర్ హ్యూమన్ అనిమల్ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వికలాంగుల కోసం దీన జనసేవా సమితి బెడ్లు, ఫ్యాన్లు, ఇతర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి డి.షైలాపవిత్రన్, శవికళ పాల్గొన్నారు.

20న దీపావళి ఆస్థానం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీన దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ వేడుకను పురస్కరించుకుని 17వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందని పేర్కొంది. దీపావళి ఆస్థానంలో రాత్రి 7 గంటలకు స్వామి వారికి నూతన వస్త్రాలు, దోశపడి, దీపారాధన ఉంటుందని వివరించింది. ఈ కారణంగా అమావాస్యనాడు నిర్వహించే సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవను రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

తిరుపతి

లోవోల్టేజ్ సమస్య పరిష్కారం


వెంకటాపురం అరుంధతివాడలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని రేణిగుంట సబ్ డివిజన్ వెంకటాపురం అరుంధతివాడలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజి సమస్యను గురువారం పరిష్కరించామని ఆ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు సమస్యను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఎట్టకేలకు కలిశారు

ఎమ్మెల్యే ఇంటికి సుగుణమ్మ

స్థానికాలయాల కమిటీపై చర్చ


ఎమ్మెల్యే ఆరణి ఇంటి వద్ద సుగుణమ్మ, కూటమి నేతలు

తిరుపతి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ మధ్య గురువారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్జీవో కాలనీలోని ఆరణి నివాసానికి సుగుణమ్మ తన అనుచరులతో కలిసి వెళ్లి ఆత్మీయంగా పలకరించుకోవడం రాజకీయవర్గాల్లో చర్చ సాగింది. కూటమి పొత్తుల్లో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో సుగుణమ్మ వర్గంలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా వీరు ఎడముఖం, పెడముఖంలా ఉంటున్నారన్న ప్రచారముంది. దీంతో నామినేటెడ్ పదవుల పంపకాల్లోనూ ఆలస్యం, సమష్టి నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి విమర్శలు వచ్చాయి. దీనిపై అధిష్ఠానం జోక్యం చేసుకున్నట్లు తెలిసింది. కలిసి పనిచేసుకోవాలని, పొత్తు ధర్మం పాటించాలని సూచించినట్టు సమాచారం. తిరుపతిలో త్వరలో భర్తీకానున్న స్థానికాలయాలైన శ్రీవేశాలమ్మ, అంకాళమ్మ, పెదగంగమ్మ, కల్యాణ వెంకటేశ్వర ఆలయాల పాలక మండళ్లతోపాటు ఇతర నామినేటెడ్ పదవుల పంపకాలు సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఈ క్రమంలో సుగుణమ్మ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. భర్తీ చేయాల్సిన పదవులపై చర్చించారు. కూటమి విజయానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పినట్టు తెలిసింది. నగరాభివృద్ధికి కలిసి పనిచేయాలని ఇరువురూ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు పుష్పావతి యాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, రాజారెడ్డి, బ్యాంకు శాంతమ్మ, చినబాబు, బుల్లెట్ రమణ, బీజీ కృష్ణ యాదవ్, మన్నం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, ఆర్సీ శ్రీనివాసులు, నారాయణ, రాజారాం, విశ్వనాథం, జగదీష్, కుప్పయ్య, కోటేశ్వరరావు, గంగులయ్య, రామచంద్రారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పనులతో సరిపెట్టేస్తున్నారు..

కేబీనగర్ వాసులకు తప్పని దారి కష్టాలు



కేబీఆర్ నగర్ రోడ్డుపై పారుతున్న మొరవ నీరు - తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పైపులు

తిరుపతి అర్బన్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీ కరకంబాడి ప్రధాన రహదారి కేబీఆర్ నగర్ రోడ్డు మరమ్మతు పనులు అడ్డగోలుగా చేస్తున్నారు. కరకంబాడి ప్రధాన రహదారి నుంచి కేబీఆర్ నగర్‌కు వెళ్లేమార్గంలో చెన్నాయి గుంట చెరువు మొరవ నీటితో తరచూ రోడ్డు కోతకు గురవుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొరవ ఉధృతంగా ప్రవహించి కేబీఆర్ నగర్‌కు వెళ్లే దారి పూర్తిగా మునిగిపోయింది. రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి రాళ్లు తేలిపోయింది. ఓ చోట రోడ్డు పూర్తిగా తెగిపోయింది. గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సచివాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్ తాత్కాలిక పనులు చేపట్టారు. భారీ సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి దారిని పునరుద్ధరించారు. శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరడంతో రూ.20లక్షలతో వంతెన నిర్మించారు. ఆ సమయంలోనూ కాలువలో పూడిక, ఆక్రమణలు తొలగించలేదు. వైసీపీ సర్పంచ్ కనీసం పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షం వస్తే సమస్య మొదలవుతుందని, పూర్తి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


చెట్లతో నిండిపోయిన మొరవకాలువ

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం అభినందనీయం


అభినందన సభలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి (ఆటోనగర్), అకోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు సంబంధించిన కొన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ మినీ వర్కర్ల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిం దన్నారు. 42 రోజుల పాటు అంగన్‌వాడీలు నిరవధికంగా సమ్మె చేశారని, ఆ సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు నేడు కొన్ని సమస్యలు పరిష్కరించారని వివరించారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించడం అభినందనీయమన్నారు. వేతనాల పెంపు అంశంపై నిర్ణయం ప్రకటించకపోవడం సమంజసంగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, పద్మలీల, వాణిశ్రీ, రాజేశ్వరి, ఇంద్రాణి, నిర్మల, నాగభూషణమ్మ, ధనమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

పద్మావతి డిగ్రీ కాలేజీలో సీట్ల పెంపునకు కృషి

టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో విద్యార్థుల డిమాండుకు అనుగుణంగా కాలేజీ, హాస్టల్ సీట్ల పెంపునకు కృషి చేస్తానని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. పద్మావతి కాలేజీని గురువారం ఆయన సందర్శించారు. కాలేజీ, హాస్టళ్లను పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, వ్యవసాయ నేపథ్యం గల విద్యార్థులు శ్రీవారి చెంత చదవాలనే ఆశతో వస్తున్నారని, వీరికి హాస్టల్ సీట్లు పెంచి చదువుకునే అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. గతంలో ఎస్వీ జూనియర్ కాలేజీ తరహాలోనే పద్మావతి డిగ్రీ కాలేజీలోనూ సీట్లు పెంచేందుకు కృషి చేస్తానన్నారు.

కొత్త జీఎస్టీపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమలేష్ నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ విధానంపై పద్మావతి మహిళా జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విషయ నిపుణులు తిరుమలేష్ నాయుడు మాట్లాడుతూ.. తగ్గిన ధరలపై సామాన్య ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరి మాట్లాడుతూ సెప్టెంబరు 22వ తేదీ నుంచి కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఎంసీఏ విభాగాధిపతిగా విజయలక్ష్మి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఎంసీఏ విభాగాధిపతిగా కె.విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఈ క్రమంలో ఎంసీఏ విభాగాధిపతిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధ్యాపకులు అభినందించారు.

రుయా అత్యవసర విభాగంలో పడకలు పెంచాలి



తిరుపతి(వైద్యం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో పడకలు పెంచాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని శ్రీజనతా సేవమిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గురువారం రుయా అత్యవసర విభాగం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆ సంస్థ ప్రతినిధి కిరీటిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమత లేని నిరుపేదలు వైద్యం కోసం రుయాస్పత్రికి వస్తే ఇక్కడ కనీస వసతులు లేకపోవడం అన్యాయమన్నారు. అత్యవసర విభాగంలో ఒకే పడకపై ఇద్దరేసి రోగులను పడుకోబెట్టి వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఇలా చేయడం వలన ఒక రోగికి ఉన్న జబ్బులు మరొకరికి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అనాథలకు ప్రత్యేక వసతులు కల్పించడంతోపాటు ఓపీ విధానాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ రాధను కలిసి వినతిపత్రం అందించారు.

తుడాకు ఏడీబీ సహకారం


ఏడీబీ పీవోతో తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి

తిరుపతి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు ఏసియన్ డెవలెప్మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సహకారం అందించనుందని ఛైర్మన్ దివాకర్ రెడ్డి చెప్పారు. న్యూఢిల్లీలో జరిగిన ఎరైజ్ సిటీస్ ఫోరం-2025 సదస్సులో దివాకర్ పాల్గొన్నారు. ఏడీబీ సౌత్ ఆసియా డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రత్యూష్ కాంత్‌ను గురువారం కలుసుకున్నారు. తుడా పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలు, కొత్త అంతర్జాతీయ నిధుల సమీకరణ అవకాశాలపై చర్చించారు. ఏడీబీ ద్వారా ఆర్థిక, సాంకేతిక సహకారం అందించే మార్గాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్టు తుడా ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు. తుడా చేపడుతున్న అభివృద్ధిని ప్రత్యూష్ కాంత్ ఈ సందర్భంగా అభినందించారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. గురువారం సాయంత్రం జ్యోతి థియేటర్ సమీపంలోని 30వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. పనివేళల్లో ఎవరైనా ప్రజలకు అందుబాటులో లేకుంటే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుంటే కేసులు

బార్లు, మద్యం దుకాణాల నిర్వాహకులకు సీఐ హెచ్చరిక


మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఈస్ట్ సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుంటే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు గురువారం నగరంలోని బార్లు, మద్యం దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. ఈస్ట్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాల వద్ద గొడవలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తుండటంతో డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, సిబ్బంది కలసి తనిఖీలు చేశారు. ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన సమావేశంలో దుకాణాలు మొత్తం కవరయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పినా ఇంకా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పోలీసుల ఆదేశాలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా లీలామహల్ వద్ద ఉన్న రెండు బార్లపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే ఎక్సైజ్ అధికారులకు రిపోర్టు పంపుతామని అన్నారు.

మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను గుర్తించండి

నిమ్‌హాన్స్ డాక్టర్ శేఖర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేలా చూడాలని బెంగళూరులోని నిమ్‌హాన్స్ డాక్టర్ శేఖర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో మానసిక ఆరోగ్యంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు నడక, వ్యాయామం, ధ్యానం, యోగా సాధన చేయాలన్నారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే జీవితంలో లక్ష్యాన్ని సాధించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ, ఉమెన్ స్టడీస్, సోషియల్ వర్క్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రజలకు ఆదా

తిరుపతి అర్బన్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేపట్టిన జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ వల్ల క్యాన్సర్, గుండె, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల మందుల ధరలు తగ్గాయని తెలిపారు. జీవిత బీమాపై జీఎస్టీ పూర్తిగా రద్దయిందన్నారు. వ్యాపారులు తగ్గిన జీఎస్టీ ధరలను అమలు చేయాలని కోరారు.

నగరంలో మోస్తరు వర్షం




తిరుపతి అర్బన్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం రాత్రి ఓమోస్తరు వర్షంకురిసింది. సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. ఆకాశంలో ఉరుములు, మెరుపులతో బెంబేలెత్తించింది. వర్షం ఆలస్యంగా మొదలై కాసేపు కురిసింది. రోడ్లపై సంచరిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు తడిసిపోయారు. చల్లదనంతో పాటు ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి మృతి


సంతోష్ (ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్/వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి సంతోష్(17) మృతి చెందాడు. వరదయ్యపాళెంలోని బజారు వీధిలోని పరంధామయ్య కుమారుడు సంతోష్ నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఇతడు.. తిరిగి కళాశాలకు వెళ్లేందుకు తడలో రైలు ఎక్కాడు. నాయుడుపేట స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, సినీ దర్శకుడు వీవీ వినాయక్, నటి రోహిణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తెలంగాణ శివశక్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శ్యామలాదేవి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వివి వినాయక్ - రోహిణి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,861

తలనీలాలు సమర్పించినవారు: 31,802




తరునీష్ జత్యా

ఇష్టపడిన రంగంలో కష్టపడితే ఫలితాలెలా ఉంటాయో నిరూపిస్తున్నాడు తరునీష్ జత్యా. తనకు నచ్చిన విలువిద్యపై ఫోకస్ పెట్టి బాణంలా దూసుకుపోతున్నాడీ కుర్రాడు. అర్జునుడిలా విల్లు ఎక్కి పెట్టి లక్ష్య ఛేదనలో చక్కగా రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలను సొంతం చేసుకుంటున్నాడు.


- గూడూరు, ఆంధ్రజ్యోతి

గురి తప్పని తరునీష్

- విలువిద్యలో చక్కని ప్రతిభ
- ఒలింపిక్ లక్ష్యంగా పరిశ్రమ

గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన కోదండపాణి, సత్య దంపతుల కుమారుడు తరునీష్ జత్యా. కోదండపాణి టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుమారుడ్ని ఏదో క్రీడలో గొప్పవాడిగా చూడాలని ఆశపడేవాడు. ఈ క్రమంలో గూడూరులో అర్జున్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటైంది. విలువిద్యపై తరునీష్ ఆసక్తిని గమనించి 2018లో అందులో చేర్పించాడు. అప్పుడు 5వ తరగతి చదువుతున్న తరునీష్ కోచ్ శివశంకర్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. ప్రావీణ్యత సాధించాడు. అంకుఠిత దీక్ష, ఏకాగ్రత ఉంటేనే నిలదొక్కుకునే ఈ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం సైదాపురంలోని ఓ ప్రైవేటు జూనియర్ కలాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరోపక్క అహ్మదాబాదులోని ఓ ఆర్చరీ అకాడమీలో నాలుగు నెలలుగా శిక్షణ పొందుతున్నాడు.




డబుల్ గోల్డ్ మెడల్స్‌తో...

ఒలింపిక్‌లో మెడల్ లక్ష్యం

ఆర్చరీ అంటే ప్రాణం. పదో ఏడాది నుంచి ఈక్రీడపైనే దృష్టి పెట్టాను. అమ్మానాన్నలూ ప్రోత్సాహమందిస్తున్నారు. మన దేశం తరఫున ఒలింపిక్ పోటీలలో పాల్గొని పతకం సాధించడమే నా ముందున్న ఏకైక లక్ష్యం. ఇందుకు పట్టుదలతో శ్రమిస్తున్నాను. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాననే నమ్మకముంది.

- తరునీష్ జత్యా

పదో ఏట నుంచే పతకాలు

తరునీష్ చిన్నతనం నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ చాటుతున్నాడు. గతేడాది నవంబరులో గుజరాత్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వ్యక్తిగత, ఓవరాల్ విభాగాలలో డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఈ కుర్రాడి ప్రతిభకు ముచ్చటపడి రూ.50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. ఈ ఏడాది మేలో బీహార్ జరిగిన ఖేలో ఇండియా పోటీల్లోనూ మెరిసి కాంస్య పతకం దక్కించుకున్నాడు. 2022లో రాష్ట్రస్థాయి జూనియర్స్‌లో, గతేడాది రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. ఈయేడాది జనవరిలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచాడు.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

- పీఏసీఎస్ వ్యాపార విస్తరణకు కృషి
- ముగింపు సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని


సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార రంగం సాంకేతిక ఆధారిత బహుముఖాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలకు రూపకల్పన చేసినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని తెలిపారు. తిరుపతి తాజ్‌హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. 'సహకార్ సే సమృద్ధి- సహకారంతో సుసంపన్నత' అంశంపై చర్చించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ, డిజిటల్ లావాదేవీలు, బహుముఖ సేవలపై చర్చించినట్లు చెప్పారు. ఏపీలో 2,021 పీఏసీఎస్‌లను డిజిటలైజేషన్ చేసి ఈ-పీఏసీఎస్‌గా మార్చడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లలో నగదు రహిత లావాదేవీలు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా పేపర్‌లెస్ వ్యవస్థలు, వన్‌స్టాప్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో పాలు, మత్స్య సహకార సమాఖ్యను బలోపేతం చేస్తామని వివరించారు. అనారోగ్య సహకార సంస్థల లిక్విడేషన్‌కు బదులుగా సంస్కరణలు చేపడతామని చెప్పారు. ఈ సదస్సు విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, అధికార యంత్రాంగానికి ఆశిష్‌కుమార్ భూటాని, రాష్ట్ర సహకార కమిషనర్ బాబు అభినందనలు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకార శాఖ అధికారులతో పాటు జిల్లా అడిషనల్ రిజిస్ట్రార్ ఆనందబాబు, గౌరీశంకర్, డీసీవో లక్ష్మి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు

- నేను చనిపోయాక నగదు నా ఇంటికి చేర్చండి
- ఎస్వీ జూపార్కు టైమ్‌స్కేల్ ఉద్యోగి సెల్ఫీ వీడియో

మంగళం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను చేసిన పనులకు డబ్బులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారంటూ ఎస్వీ జూపార్కులో టైమ్‌స్కేల్ ఉద్యోగి హరియాదవ్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. 'నేను జూపార్కులో అనేక పనులు చేశా. దీనికి రూ.11లక్షలకు నగలు కుదువబెట్టా. బిల్లులు అడిగితే ఒకసారి రూ.7.70లక్షలు, మరోసారి రూ.50వేలు, ఇంకోసారి రూ.లక్ష, ఆ తర్వాత రూ.8వేలు ఇచ్చారు. ఇంకా రూ.26లక్షలు రావాలి. ఈ బిల్లులు ఇవ్వకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. సహనం కోల్పోయి నేను ఆత్మహత్య చేసుకుంటే.. ఆ మొత్తాన్ని నా కుటుంబానికి అందించండి' అంటూ కన్నీటితో సెల్ఫీ వీడియో పెట్టారు. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరపాలని డిమాండు చేశారు. దీనిని చూసిన వారంతా ఆందోళన చెందారు. కాగా, గురువారం హరి జూపార్కులో తన విధులకు హాజరుకావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అతడి అక్రమాలు బయటపడతాయనే

- అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్

హరి సెల్ఫీ వీడియోపై ఎస్వీ జూపార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ స్పందించారు. '2023లోనే అతడు చేసిన పనులకు బిల్లులను చెల్లించాం. సెప్టెంబరు నెలలో హరి చేసిన పనులపై వచ్చిన ఆరోపణలకు క్యూరేటర్ సెల్వం ఏసీఎఫ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేశారు. అతడి వద్ద బిల్లులు ఏవైనా ఉంటే ఇవ్వాలని కమిటీ కోరినప్పుడు.. నా వద్ద ఏమీ లేదని అతడు రాతపూర్వకంగా రాసిచ్చారు. హరి చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని భయపడి ఇలా చేసి ఉంటారు' అని జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. జూపార్కు క్యూరేటర్ ఆదేశాలతో దీనిపై లోతైన విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఏర్పేడు పీఏసీఎస్‌కు సిక్కిం ప్రతినిధులు


పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉన్న సిక్కిం సహకార శాఖ ప్రతినిధులు తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (పీఏసీఎస్) గురువారం సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ కార్యదర్శి గ్లోరియా నాంచ్, అదనపు రిజిస్ట్రార్ కేశాంగ్ యాంకీ తదితరులు సందర్శించారు. తిరుపతిలో సదస్సుకు హాజరైన వీరు చివరి రోజు ఏర్పేడు పీఏసీఎస్‌కు వెళ్లారు. అక్కడి వ్యాపార లావాదేవీలను, ఈకేవైసీ నమోదు, రుణపంపిణీ, హార్డ్‌వేర్ కిట్లు తదితరాలను పరిశీలించారు. టెక్నాలజీ వినియోగం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, అధికారులు సురేష్‌కుమార్, నాగభూషణం, సంధ్యారాణి, తేజస్విని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం


సురేష్ బాబు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అరుణాచలేశ్వరుడి దైవ దర్శనానికి వెళ్లిన షార్ ఉద్యోగి పగడాల సురేష్ బాబు(45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ వాల్స్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సురేష్ బాబు కుటుంబం సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్‌లో నివాసం ఉంటోంది. మంగళవారం విధులు ముగిశాక ఆ రోజు రాత్రి పౌర్ణమి కావడంతో ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై అరుణాచలానికి బయలుదేరి వెళ్లాడు. ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమిళనాడు పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యం కాకపోవడంతో మోటారు సైకిల్ నెంబరు ఆధారంగా అడ్రసు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు వెంటనే షార్ అధికారులకు తెలియజేశారు. షార్ అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రదేశానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. తమిళనాడు పోలీసులు గురువారం పోస్టుమార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సహచర ఉద్యోగులతో కలిసిమెలిసి ఎంతో సఖ్యతగా ఉండే సురేష్ బాబు మృతి చెందాడన్న విషయం తెలియగానే షార్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శివయ్య దర్శనం కోసం బయలుదేరి అనంతలోకాలకు వెళ్లావా.. అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మళ్లీ మోదీ వస్తే రాజ్యాంగం కనుమరుగు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం కనుమరుగై ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. వరదయ్యపాళెంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను సభ్యులకు వివరించారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించి లాభం పొందాలని అమెరికా ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో సహజ వనరులను వినియోగించుకోవడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్రం సరిపడా నిధులు ఇవ్వడంలేదన్నారు. మోదీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఎదురు తిరిగితే జైల్లో పెడుతున్నారని ఆరోపించారు. దేశంలో లడఖ్‌తో తిరుగుబాటు మొదలైందన్నారు.దీని ప్రభావం అన్ని రాష్ట్రాల మీదపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ స్థాయినుంచి సీపీఐని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బలమైన పార్టీ నిర్మాణం ఆవశ్యకత అంశంపై జేవీఎస్ మూర్తి, భారత దేశ చరిత్ర, సంస్కృతి, వక్రీకరణపై కొప్పర్తి వెంకట రమణమూర్తి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామానాయుడు,నాయకులు పి.మురళి, చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై

నిందితుడి అరెస్టు

- వెస్ట్ సీఐ మురళీమోహన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేశారన్న కేసులో నిందితుడిని తిరుపతి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. సత్యసాయి జిల్లా కదిరి టౌన్ జౌకుపాళ్యంకు చెందిన కౌలేపల్లి అంజాద్‌ఖాన్ సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైళ్లను సృష్టించి వాటి ద్వారా ఇతర రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య విబేధాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నాడు. ఇందులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ గౌరవం.. మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టాడు. వీరిపై అసత్య ప్రచారాలు చేసినట్లు దర్యాప్తులో తేలడంతో గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, వర్గాల మధ్య విబేధాలు రేకెత్తించే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

- డీఈవోకు స్పష్టం చేసిన ఫ్యాప్టో నేతలు


డీఈవోకు నోటీసు అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అసోసియేషన్ (ఎఫ్‌ఏపీటీఓ) నాయకులు స్పష్టం చేశారు.ఆ మేరకు వారు గురువారం డీఈవో కేవీఎన్ కుమార్‌కు నోటీసు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేష్, డిప్యూటీ జనరల్ రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అంతకుముందు డీఆర్వోకు కూడా తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ జగన్నాథం, ఇతర నాయకులు ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, రవీంద్ర, వాసు, నిర్మల, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, మధు, రుక్మాంధ, సుబ్బారావు, పద్మజ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు చెకుముకి పేరుతో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఏటా నిర్వహించే సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, ఆర్థిక కార్యదర్శి బాషా, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం, గణిత ఫోరం సభ్యులు, ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు

- 42 మందికి బహుమతుల ప్రదానం


సర్టిఫికెట్, జ్ఞాపికను అందిస్తున్న రిజిస్ట్రార్ వినూ, డీన్ బ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య, పక్కన వైకుంఠరావు

తిరుపతిరూరల్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల పశువైద్య చికిత్స, బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్ అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. 14 టెక్నికల్ సెషన్లలో పలువురు విద్యార్థులు పేపర్లు ప్రజంటేషన్ చేశారు. అత్యుత్తమ ప్రజంటేషన్ చేసిన 42మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసినట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.వైకుంఠరావు పేర్కొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.వినూ, డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. వారు మాట్లాడుతూ వీసీసీ ఆధ్వర్యంలో ఒకే వేదికపై 14 రాష్ట్రాలకు చెందిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను భాగస్వాములు చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా రూమినెంట్ మెడిసిన్ పీజీలో డాక్టర్ సాహితి, కంపానియన్ యానిమల్ మెడిసిన్ పీజీలో డాక్టర్ రజిత, వైల్డ్‌లైఫ్, ఏవియన్ ఎక్సాటిక్ పీజీలో డాక్టర్ ఎం.ప్రశాంత్‌కుమార్ (ఎస్వీవెటర్నరీ, తిరుపతి) ప్రథమ స్థానం, యూజీలో డాక్టర్ రెబెకా(పీయూఆర్ఎన్‌టీ, కోరుట్ల) బహుమతులు అందుకున్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.ధనలక్ష్మి, డాక్టర్ ఎస్.భారతి, డాక్టర్ ఎం.రఘునాథ్, డాక్టర్ నస్రీన్ పాల్గొన్నారు.

అతిథుల కోసం..!

- రెండు బ్యాటరీ వాహనాలు కొన్న పద్మావతి యూనివర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ రెండు బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేసింది. హైదరాబాదుకు చెందిన భాగారియా ఏజెన్సీస్ నుంచీ రూ.12.6 లక్షలతో వీటిని కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. యూనివర్సిటీ చేపట్టే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వయోభారంతో వచ్చే అతిథుల కోసం వీటిని వినియోగించనున్నారు. ఈ వాహనాలను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు గురువారం ప్రారంభించారు.


బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

జీఎస్టీ ఆధ్వర్యంలో నేటి నుంచి

శిల్పారామంలో భారీ సేల్స్ ఎగ్జిబిషన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ జీఎస్టీ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వివిధ రకాల వస్తువులు భారీ అమ్మకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జీఎస్టీ సహాయ కమిషనర్లు వరలక్ష్మి, శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార వర్గాల సహకారంతో ఎలక్ట్రానిక్, ఇంటికి సంబంధించిన వస్తువులు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, సోలార్ పవర్ ప్యానెళ్ళు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు. తగ్గించిన జీఎస్టీ ధరలు, వినియోగదారులకు అదనపు లాభం చేకూర్చడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

పంట పొలాలపై 'గజ'దాడులు

భాకరాపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బుధవారం రాత్రి ఎగపూరు గ్రామానికి చెందిన అమరేంద్ర, రెడ్డెమ్మ, విజయ సారథికి చెందిన సుమారు 5 ఎకరాలలో వరి పంటను ధ్వంసం చేశాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి పంటలను ధ్వంసం చేసి, పగలు సమీపంలోని అడవిలోకి వెళ్లిపోతున్నాయి. గురువారం రాత్రి పూజారివాండ్లపల్లె, ఈదలచెరువు, పాలమాకులపల్లె, గాండ్లపల్లి వైపు వచ్చే అవకాశం ఉందని, రైతులెవరూ పంట పొలాల వైపు వెళ్లవద్దని అటవీ శాఖాధికారులు హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

అల్లర్లు రేపేందుకు అంబేడ్కర్‌ను వాడుకుంటారా?

నిరసన సభలో నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే పాశం

గూడూరు అర్బన్, 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లేందుకు మహనీయుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను వాడుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన ఘటనను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నంతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం తప్ప వేరే ఏ రాజకీయ పార్టీ దళితలకు మేలు చేయలేదన్నారు. దళితతేజం- తెలుగుదేశం కార్యక్రమం ద్వారా దళితుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చంద్రబాబునాయుడు నేతృత్వంలో నిర్వహించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా వెదరుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించి, ఎన్డీఏ ప్రభుత్వంపైకి నెట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు కుట్రపన్నడం దుర్మార్గమన్నారు. పోలీసుల విచారణతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. దళితుల దేవుడైన అంబేడ్కర్ జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 52వేల మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా 192 మంది దళితులను చంపారని, ఈ పాపమంతా జగన్ అండ్ కో దేనన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ బాబాయి గొడ్డలి వేటు.. కోడికత్తి.. గులకరాయి ఘటనల మాదిరిగా దళితుల ఆరాధ్యదైవం అంబేడ్కర్‌ను వాడుకోవాలనుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీపతిబాబు, పెంచలయ్య, సురేంద్ర, అరవ పార్వతయ్య, కుమారి, రాజేంద్ర, రఘు, రాజా రమేష్, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం

దమ్ము, ధైర్యం గురించి వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు

ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిరికి వాడిలా అసెంబ్లీకి రాకుండా ఇంటికే పరిమితమైన జగన్ దమ్ము, ధైర్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురు వారం స్థానిక పోలేరమ్మ గుడి వద్ద నుంచి నిర్వహించిన జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలిపిరి వద్ద టెర్రరిస్టులు దాడి చేసినా వెనకడుగు వేయని ధైర్యవంతుడు చంద్రబాబు, అలాంటి నాయకుడిని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది. కానీ ఆయన పిరికివాడిలా తప్పించుకొంటు న్నారంటూ ఎద్దేవా చేశారు. వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి తనపై చేసే అవగాహన లేని వ్యాఖ్యలను తాను అసలు పట్టించుకోనని కురుగొండ్ల అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు, సామాన్యులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సామల లక్ష్మీపతి, కేవీకే ప్రసాద్ నాయుడు, జానపాటి మురళి, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, తాండవ చంద్రారెడ్డి, గొల్లగుంట వెంకటముని తదితరులు పాల్గొన్నారు.


జీఎస్టీ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే కురుగొండ్ల

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జశ్వంత్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... బాలాయపల్లి మండలం గొట్టికాడుకు చెందిన జశ్వంత్(23) గూడూరులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గొట్టికాడు నుంచి బైక్‌పై గూడూరుకు వస్తుండుగా వెందోడు సమీపంలో మరో ద్విచక్ర వాహనం వేగంగా వస్తూ ఢీకొంది. ఈ సంఘటనలో జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా ఎదురుగా వచ్చి ఢీకొన్న మరో ద్విచక్ర వాహనదారుడు శీనయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. జశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మత్స్యకార నేత సుందరయ్య వర్ధంతి


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నేత బొమ్మన సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బస్టాండ్ కూడలిలో సుందరయ్య చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను అప్పటి ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి వారికి అండగా నిలిచిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, సెల్వం, నీలకంఠం, పళణి, సుదర్శన్, టీకే శ్రీనివాసన్, చంద్రయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సుందరయ్య స్వగ్రామం వాటంబేడు కుప్పంలో మత్స్యకార నాయకులు సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

9 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్మగ్లర్ అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుల్లంపేట వద్ద గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం బుదవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున ఎం.బావి ఫారెస్టు బీటు పరిధిలో రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అన్నమయ్య జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం అభినందనీయం


అభినందన సభలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), అకోబరు 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు సంబంధించి కొన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ మినీ వర్కర్ల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిం దన్నారు. 42 రోజుల పాటు అంగన్‌వాడీలు నిరవధికంగా సమ్మె చేశారని, ఆ సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు నేడు కొన్ని సమస్యలు పరిష్కరించారని వివరించారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించడం అభినందనీయమన్నారు. వేతనాల పెంపు అంశంపై నిర్ణయం ప్రకటించక పోవడం సమంజసంగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, పద్మలీల, వాణిశ్రీ, రాజేశ్వరి, ఇంద్రాణి, నిర్మల, నాగభూషణమ్మ, ధనమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: పాశం

కోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటి నేరవేరుస్తూ అభివృద్ధిని పరు గులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. కోట పట్టణంలో గురువారం జీఎస్టీ తగ్గింపు, రాయితీలు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. ఇంటింటా తిరిగి జీఎస్టీపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం పుచ్చలపల్లిలో టీడీపీ మహిళా నాయకురాలు కర్మక్రియల్లో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీపతిబాబు, చిల్లకూరు దశరధ రామిరెడ్డి, నాయకులు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, పాదర్తి కోటారెడ్డి, దారా సురేష్, షంషుద్దీన్, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

చిల్లకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీలోని రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. గురువారం కృష్ణాపురం గిరిజన కాలనీలో తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న మట్టిరోడ్ల పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

కోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంట పాళెం పంచాయతీలో గల రామిరెడ్డి చెరువును రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో భూములను కొనుగోలు చేసిన ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా చెరువు ఎగువ భాగంలో నేలబావిని తవ్వారు. ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం చెరువులో అక్రమంగా తవ్విన బావిని పరిశీలించారు. ఈ బావిని మూడు రోజుల్లో పూడ్చివేయాలని తహసీల్దారు జయజయరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

విద్యా కిట్ల పంపిణీ

గూడూరు, అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు గురువారం గాయత్రి పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా గాయత్రి పాఠశాల కరస్పాం డెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా గుణాన్ని పెంపొందించేందుకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్ర మంలో మల్లికార్జున్, సుప్రజ, రేవతి, రజని, మస్తాన్‌బీ, నాసిర, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఆర్ నాయుడు తదితరులు

వెంకటగికి టౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కరించాలని మాజీ ఉప ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడికి వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు గురువారం వినతిపత్రం అందించారు. తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన వెంకయ్య నాయుడిని కలిసిన ఎస్ఎస్ఆర్ నాయుడు ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు, చేనేతలకు స్టాండింగ్ ముగ్గాలను మంజూరు చేయడానికి కృషి చేయాలని కోరారు.

పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ

గ్రామసభను బహిష్కరించిన సర్పంచ్


గ్రామసభ నుంచి వెళ్లి పోతున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

బాలాయపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం పంచాయతీలోని అక్కసముద్రం గ్రామాన్ని విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు గురువారం వెంగమాంబపురం సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామసభ నిర్వహించారు. మొత్తం 122మంది హాజరుకాగా వైసీపీ సర్పంచ్ బాపనపల్లి వెంకట సుబ్బయ్య పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. ఇంతలో ఇరు గ్రామాల ప్రజల మధ్య వివాదం రేగడంతో కొందరు కలగజేసుకుని సర్దుబాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామ సభను వాయిదా వేశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామంటూ అక్కసముద్రం గ్రామస్తులు వెనుతిరిగారు. అదే విధంగా నిడిగల్లు పంచాయతీ నుంచి గాజులపల్లి, గొల్లపల్లి గ్రామాలను విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడానికి పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు, సర్పంచ్ చప్పిడి గాయత్రి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 110మంది హాజరుకాగా 109మంది పంచాయతీ విభజనకు అంగీకరించగా ఒక్కరు వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రత్నమ్మ, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు ఆదివెంకట కృష్ణారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

వీసీల నియామకంలో రజకులకు చోటు హర్షణీయం

తిరుపతి(జీవకోన), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్ల నియామకాల్లో రజక సామాజికవర్గానికి చోటు కల్పించడంపై రజక సంఘం నేత అక్కినపల్లి లక్ష్మయ్య హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ వెంకటసుబ్బారావును విజయనగరం గురజాడ యూనివర్సిటీ వీసీగా నియమించడం సంతోషం కలిగించిందన్నారు. ప్రభుత్వం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

20న దీపావళి ఆస్థానం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీన దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. దీపావళి ఆస్థానంలో రాత్రి 7 గంటలకు స్వామివారికి నూతన వస్త్రాలు, దోశపడి, దీపారాధన ఉంటుందని వివరించింది. ఈ కారణంగా అమావాస్యనాడు నిర్వహించే సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవను రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

రైతులకు యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న కేవీ నాయుడు, ప్రసాద్‌నాయుడు,

పెళ్లకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా పంపిణీని పీఏసీఎస్ అధ్యక్షుడు కొచ్చర్ల వెంకటర మణయ్య నాయుడు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థానికంగా ఎరువులను అందుబాటులో ఉంచి అందిస్తున్నామన్నారు. స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ మండ లం లోని 13 సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేసేందుకు యూరియా పంపిణీ కార్డులను వ్యవసాయశాఖ అధికారులు అందిస్తున్నార న్నారు. కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జునసాగర్, మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఏఈవో పుట్టయ్య, వీఏఏ సుమతి, టీడీపీ నాయకులు సన్నాడి వేణురెడ్డి, చిట్టిరెడ్డి, ఆరూరు పరందామయ్య మొదలియార్, వెంకటేశ్వర్లు మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ బాబుకు ఉత్తమ అవార్డు


బాబును సన్మానిస్తున్న ప్రతినిధులు

తిరుపతి(విద్య), అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన ఎం.బాబుకు గురుతేజం జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన 30 ఏళ్లుగా చేసిన విశేష సేవలకు గుర్తింపుగా గురువారం చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఉషోదయ ఫౌండేషన్, ఎం.వి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్, తెలుగు కళారత్నాల సాంస్కృతిక సేవా సంస్థ, ఏపీ జూనియర్ చాంబర్ ఇంటర్నేషన్ ఇండియా ప్రతినిధులు ఆయన్ను సన్మానించి, అవార్డు ప్రదానం చేశారు.

పద్మావతి డిగ్రీ కాలేజీలో సీట్ల పెంపునకు కృషి

టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో విద్యార్థుల డిమాండుకు అనుగుణంగా కాలేజీ, హాస్టల్ సీట్ల పెంపునకు కృషి చేస్తానని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. పద్మావతి కాలేజీని గురువారం ఆయన సందర్శించారు. కాలేజీ, హాస్టళ్లను పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, వ్యవసాయ నేపథ్యం గల విద్యార్థులు శ్రీవారి చెంత చదవాలనే ఆశతో వస్తున్నారని, వీరికి హాస్టల్ సీట్లు పెంచి చదువుకునే అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. గతంలో ఎస్వీ జూనియర్ కాలేజీ తరహాలోనే పద్మావతి డిగ్రీ కాలేజీలోనూ సీట్లు పెంచేందుకు కృషి చేస్తానన్నారు.

మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను గుర్తించండి

నిమ్‌హాన్స్ డాక్టర్ శేఖర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేలా చూడాలని బెంగళూరులోని నిమ్‌హాన్స్ డాక్టర్ శేఖర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో మానసిక ఆరోగ్యంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు నడక, వ్యాయామం, ధ్యానం, యోగా సాధన చేయాలన్నారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే జీవితంలో లక్ష్యాన్ని సాధించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ, ఉమెన్ స్టడీస్, సోషియల్ వర్క్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు


పీవీకండ్రిగలో బావి వద్ద నీటిని పరీక్షిస్తున్న అధికారులు

కేవీబీపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరాజుల కండ్రిగ, పవనివారికండ్రిగ గ్రామాల్లో గురువారం ఆరు జిల్లాలకు సంబంధించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో ట్యాంకు ద్వారా వచ్చే నీటిని, బావి నీటిని, కుళాయి నీటికి పరీక్షలు నిర్వహించారు. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన అధికారులకు శ్రీకాళహస్తిలో శిక్షణ జరుగుతోంది. ఈ శిక్షణలో భాగంగా వీరు గ్రామాల్లో పర్యటించి తాగునీటిని సేకరించి అక్కడే పరీక్షలు నిర్వహంచారు. దీంతో పాటు డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు.

ఎట్టకేలకు కలిశారు

ఎమ్మెల్యే ఇంటికి సుగుణమ్మ

స్థానికాలయాల కమిటీపై చర్చ


ఎమ్మెల్యే ఆరణి ఇంటి వద్ద సుగుణమ్మ, కూటమి నేతలు

తిరుపతి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ మధ్య గురువారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్జీవో కాలనీలోని ఆరణి నివాసానికి సుగుణమ్మ తన అనుచరులతో కలిసి వెళ్లి ఆత్మీయంగా పలకరించుకోవడం రాజకీవర్గాల్లో చర్చ సాగింది. కూటమి పొత్తుల్లో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో సుగుణమ్మ వర్గంలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా వీరు ఎడముఖం, పెడముఖంలా ఉంటున్నారన్న ప్రచారముంది. దీంతో నామినేటెడ్ పదవుల పంపకాల్లోనూ ఆలస్యం, సమష్టి నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి విమర్శలు వచ్చాయి. దీనిపై అధిష్ఠానం జోక్యం చేసుకున్నట్టు తెలిసింది. కలిసి పని చేసుకోవాలని, పొత్తు ధర్మం పాటించాలని సూచించినట్టు సమాచారం. తిరుపతిలో త్వరలో భర్తీకానున్న స్థానికాలయాలైన శ్రీవేశాలమ్మ, అంకాళమ్మ, పెదగంగమ్మ, కల్యాణ వెంకటేశ్వర ఆలయాల పాలకమండళ్లతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల పంపకాలు సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఈ క్రమంలో సుగుణమ్మ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. భర్తీ చేయాల్సిన పదవులపై చర్చించారు. కూటమి విజయానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పినట్టు తెలిసింది. నగరాభివృద్ధికి కలిసి పనిచేయాలని ఇరువురూ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు పుష్పావతి యాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, రాజారెడ్డి, బ్యాంకు శాంతమ్మ, చినబాబు, బుల్లెట్ రమణ, బిజీ కృష్ణ యాదవ్, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, ఆర్సీ శ్రీనివాసులు, నారాయణ, రాజారాం, విశ్వనాథం, జగదీష్, కుప్పయ్య, కోటేశ్వరరావు, గంగులయ్య, రామచంద్రారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత ఎస్వీయూ కాలేజీ


సాఫ్ట్‌బాల్ విజేత ఎస్వీయూ జట్టు

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ మైదానంలో గురువారం నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. తుదిపోరులో ఎస్వీయూ కాలేజీ, పీవీకేఎన్ చిత్తూరు డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ, మెడల్ అందించారు.

ఎస్పీ కార్యాలయంలో 'ప్రత్యేక సేవ'

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీన జనసేవ సమితి సొసైటీ ఫర్ హ్యూమన్ అనిమల్ ఆధ్వర్యంలో గురువారం ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు, వికలాంగుల కోసం దీన జనసేవా సమితి బెడ్లు, ఫ్యాన్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. సమితి కార్యదర్శి షైలాపవిత్రన్, శవికళ పాల్గొన్నారు.



బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

యూరియా పంపిణీలో నిబంధనలు పాటించాలి

ఏర్పేడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో నిబంధనలు పాటించాలని లేకుంటే డీలర్లపై చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి తెలిపారు. ఏర్పేడులోని ఎరువుల డీలర్లతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంటలు సాగుచేస్తున్న ప్రతి రైతుకూ కార్డులు సంబంధిత రైతు సేవా కేంద్రాలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్డు ఉన్న వారికే యూరియా ఇవ్వాలన్నారు. రైతులకు ఉన్న పొలం ఆధారంగా ఎంత మేర ఇవ్వాలో అంతే ఇవ్వాలని స్పష్టంచేశారు.

రామాంజులనాయుడు దంపతులకు సన్మానం



కేవీబీపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు 50వ పెళ్లిరోజు సందర్భంగా ఆ దంపతు లను మండల టీడీపీ నాయకులు వారి నివాసంలో గజమాలలు వేసి దుశ్శాలువాతో సన్మానించారు. టీడీపీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, బాలయ్య, సురేష్‌రెడ్డి, చంద్రయ్య, వెంకటేష్, రామచంద్రయ్య, బాలాజీ, వగత్తూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఇంట సీఎం కార్యక్రమాల పర్యవేక్షకులు

పెందుర్తి వెంకటేష్



శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం కార్యక్రమాల నిర్వహణ పర్యవేక్షకులు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నారావారి పల్లెలో సీఎం చంద్రబాబు కార్యక్రమాల అనంతనం శ్రీకాళహస్తి లోని ఎం జీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ నివాసానికి గురువారం చేరుకున్నారు. తన అల్లుడు మయూర్, కుమార్తె ఐశ్వర్య లక్ష్మీ, మనవళ్లతో కాసేపు గడిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్‌చైర్మన్ గుడ్లూరు మల్లి కార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

రేణిగుంట: గుంట పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకున్న ప్రాంతాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం కరకంబాడి పంచాయతీ పరిధిలో ఉన్న చెన్నయ్యగుంట గ్రామంలో సర్వేనంబరు 453లో ఉన్న గుంట పోరంబోకు స్థలం ఆక్రమించుకుని గడ్డివాము, షెడ్లు నిర్మించడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు.

అరుంధతివాడలో లోవోల్టేజి సమస్యకు పరిష్కారం

రేణిగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం పంచాయతీ పరిధిలోని ఆరుంధతివాడలో లోవోల్టేజి సమస్యకు విద్యుత్ అధికారులు పరిష్కరించారు. గురువారం ఆరుంధతివాడలో మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో విద్యుత్ ఏఈ పుణ్యకోటి, సహకార సంఘం చైర్మన్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మేచెలి భాస్కర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, చంద్రయాదవ్ పాల్గొన్నారు.

'బోధనేతర పనులు బహిష్కరిద్దాం'

రేణిగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులను బహిష్కరిద్దామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఫ్యాప్టో రేణిగుంట ఉపాధ్యాయ నాయకులు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, చంద్ర, ఎస్టీయూ నాయకులు సురేష్, నరసింహులు, ఏపీటీఎఫ్ నాయకులు ఎంఈవో-2 రంగనాథయ్యకు వినతిపత్రం సమర్పించారు.

ఆయుధ పూజకు అనుమతులు ఇప్పించండి

రేణిగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజకు అనుమతులు ఇప్పిం చాలని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు కోరుతున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే అనుమతులతో 38 ఏళ్లుగా ఆటో స్టాండ్ నడుస్తూ ఉంది. ఇటీవల ఆయుధాల పూజ చేయాలని ఆటో యూనియన్ నాయకులు చర్యలు చేపట్టారు. ఆటో స్టాండ్‌కి వెనుక ఉన్న ఓ భవనం నిర్మాణానికి రైల్వే గోడను తొలగించి నిర్మాణ వస్తువులను అడ్డుగా పెట్టారు. దీంతో ఆటో యూనియన్ నాయకులు ఆయుధాల పూజ చేసేందుకు ఇంటి నిర్మాణ వస్తువులు తీయిం చాలని కోరడంతో హోటల్ యజమాని తాము రైల్వే నుంచి పూర్తి అనుమతులతో గోడను తొలగించి లాడ్జి నిర్మిస్తున్నామని ఇక్కడ ఎటువంటి వస్తువులు తీసేది లేదని ఇటువైపే దారిని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ విషయమై స్టేషన్ మాస్టర్ శేషగిరి రెడ్డిని వివరణ కోరగా రైల్వే గోడను పగులగొట్టి భవన నిర్మాణ అనుమతులు ఎవరు ఇచ్చారో తెలుసుకుంటామని, అనుమతులు లేకపోతే చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుండి తమకు ఇవ్వాల్సిన వేతనాలు వెంటనే చెల్లించాలని మండలంలోని కురింజలం భారత్ షూ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు గురువారం పరిశ్రమ ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పరిశ్రమ మేనేజర్, మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ కుమ్మక్కై జీతాలు అడిగిన పాపానికి పరిశ్రమను మూసివేసి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో తణుకు ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

బోధనేతర పనులు చేపట్టబోం

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బోధనేతర పనులను చేపట్టబోమని ఫ్యాప్టో నాయకులు అన్నారు. గురువారం తొట్టంబేడు ఎంఈవోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఫ్యాప్టో నాయకులు సాయిశ్రీనివాస్, చిరంజీవి, నరహరి, మనోజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, భాను మూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బస్సు సమయం ముందుకు

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి -నెల్లూరు మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సు సమయాన్ని ముందుకు మార్చడంతో ప్రయాణి కులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు 8గంటలకు బస్సు బయలుదేరేది. దీంతో భక్తులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీనిపై గత నెల 21న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'శ్రీకాళహస్తి-నెల్లూరు ఆర్టీసీబస్సుల వేళలుమార్చండి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆర్టీసీ అధికారులు స్పందించి ఉద యం 7.30గంటలకు బస్సు బయలుదేరేలా మార్పు చేశారు.

జీఎస్టీ 2.0పై అవగాహన

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ రాజశేఖర్ ర్యాలీ ప్రారంభించారు. వాణిజ్య విభాగ ఇన్‌ఛార్జి సాహితి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు గ్రీన్ అంబాసిడర్ల కృతజ్ఞతలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి గురువారం గ్రీన్ అంబాసిడర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై ఆయన చర్చించారు. ఆయన సూచించిన అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని వారికి జీతాలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గ్రీన్ అంబాసిడర్లు ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహం వద్దకు చేరుకుని ఆయనను సత్కరించారు.

డాక్టర్ రమణారెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ వయ్యాల రమణారెడ్డి తల్లి వయ్యాల కాంతమ్మ గురువారం సాయంత్రం మృతిచెందారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు.

రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

సత్యవేడు: మండలంలోని వానెల్లూరు పంచాయతీలో అటవీ భూములకు పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం ఒక ప్రకటనలో కోరారు.

పిల్లల పోషణలో శ్రద్ధ అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణలో తల్లిదండ్రుల శ్రద్ధ అవసరమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళ హస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం 8వ రాష్ట్ర పోషకాహార మాసోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జంక్‌ఫుడ్స్ తగ్గించాలన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి, సీడీపీవో శాంతి దుర్గ మాట్లాడుతూ తల్లి దండ్రుల ఆధ్వర్యంలో పోషకాహార వంటల పోటీలు, తల్లిపాల ప్రాము ఖ్యతపై అవగాహన, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన తదితర వాటిపై అంగన్వాడీ స్థాయిలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మిల్లెట్స్ ఫుడ్ స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆడపిల్ల పుట్టకకు స్వాగతం పలకాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి, .జడ్పీటీసీ అర్చన, టీడీపీ నాయకులు రావిళ్ల మునిరాజా నాయుడు, చెంచయ్యానాయుడు, జయచంద్రనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, రవిరెడ్డి, ఎంపీడీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళ సంరక్షణ కార్య దర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు

అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆర్థిక సాయం



నగదుతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు సముద్రాల నంద గోపాల్ 65 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ.350 చొప్పున రూ.22,750 ఆర్థికసాయం గురు వారం అందించారు. అదేవిధంగా 6 నుంచి పదో తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు వెండి పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ అమ్మ ఎడ్యుకేషన్ ట్రస్టు వారు 28 సంవత్సరాలుగా విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గూగుల్‌లో పని చేస్తున్న యూట్యూబ్ ఆర్గనైజర్ రమణ గోగుల్, చెంచు రమణయ్య, సము ద్రాల మాధవరావు, భవిత, విజయబాబు, సురేంద్రరావు, ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామగిరిలో కొండ చిలువ హల్‌చల్



పిచ్చాటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రామగిరి దళితవాడ గ్రామ సమీపంలో పీడబ్ల్యు కాలువ ఉంది. జనావాసానికి ఆనుకుని ఉన్న కాలువ పక్కన ఓ కొండ చిలువ కోళ్లను పట్టుకుంది. ఈ ఘటన చూసిన గ్రామస్తులు భయ బ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కొండ చిలువను పట్టుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై విమానాశ్రయ భద్రతా సిబ్బందికి అవగాహన

రేణిగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విమానాశ్రయ భద్రతా సిబ్బందికి గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గురువారం మధ్యాహ్నం విమానాశ్రయం సమీపంలోని పవనంలో విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందికి డిజిటల్ అరెస్టు, పెట్టుబడి, ఓటీపీ లోన్స్ యాప్స్, హనీట్రాప్, సైబర్ నేరాల పట్ల సీఐ అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ట్రైనింగ్ ఎస్ఐ ప్రవల్లిక, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు రాజు, ధన, విమానాశ్రయ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

చెంగల్ రాయులు గుంటలో నిర్మించిన ఇళ్లకు

నోటీసులు ఇస్తాం

రేణిగుంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చెంగల్ రాయులుగుంటను పూడ్చివేసి అక్ర మంగా నిర్మించిన ఇండ్లకు నోటీసులు జారీ చేస్తామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తెలి పారు. గురువారం ఉదయం స్థానిక జ్యోతినగర్‌లోని రామకృష్ణాపురం సర్కిల్ కూడలి సమీపంలో రోడ్డుకి అనుకుని ఉన్న సర్వే నంబరు 453/6లో 6.72 ఎకరాల విస్తీర్ణంలో ఆక్రమించుకుని నిర్మించుకున్న ఇళ్లను తహసీల్దార్ పరిశీలించారు. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు డ్రైనేజీ కాలువల ద్వారా చెగల్‌రాయులు గుంటమీదుగా గురవ రాజుపల్లి చెరువులోకి కలుస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటని మాయం చేసి ప్లాట్లు వేసి విక్రయించేశారు. పంచాయతీ నిధులతో మురుగుకాలువలు సైతం నిర్మించారు. ఇటీవల ఈ విషయం తేలడంతో తహసీల్దార్ స్పందించారు.

మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన హేమలత



సత్యవేడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత కలిశారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ సమస్యలు, పార్టీ పరిస్థితులపై మంత్రితో ఆమె చర్చించినట్లు తెలిపారు.

కాలువను ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

పూతలపట్టు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనున్న కాలువను బైక్‌తో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి సమీపాన ఉన్న పెద్దగుట్టకు చెందిన జగదీష్, జయకృష్ణలు గురువారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకుని రాత్రి 7.30 గంటల సమయంలో స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని కిచ్చెన్నగారిపల్లె ఫ్లైఓవర్ సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న కాలువను ఢీకొట్టి కిందపడ్డారు. ఇద్దరూ గాయపడటంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు భారీ సేల్స్ ఎగ్జిబిషన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని సరస్వతి కల్యాణ మండపంలో రాష్ట్ర జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాపరిధిలోని వ్యాపార వర్గాల సహకారంలో శుక్రవారం, శనివారం భారీ సేల్స్ ఎగ్జిబిషన్ నిర్వహించ నున్నట్లు సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయెన్స్, టూల్స్, ఫర్నిచర్స్ వంటి విభిన్న ఉత్పత్తులు ప్రదర్శించ నున్నట్లు చెప్పారు. వినియోగ దారులు ఒకేచోట బ్రాండెడ్ ఉత్పత్తులను తక్కువ ధరలతో కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

ఆర్వోప్లాంటు వితరణ



కేవీబీపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపాళెం, కాళంగి పాఠశాలలకు కాళంగి గ్రామానికి చెందిన కొంతమంది పూర్వ విద్యా ర్థులు, ఎన్ఆర్ఐలు రితిక్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రసాద్ తమ సొంత నిధులను వెచ్చించి రూ.50వేలు విలువ చేసే ఆర్వోప్లాంట్లను, విద్యార్థులకు జామెంట్రీ బాక్సులను అందజేశారు.

బాలుకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



కయ్యూరి బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యా యులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాల సుబ్ర హ్మణ్యం జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక య్యారు. విద్య, కథలు, సాహిత్యం, వంటి రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య తెలి పారు. ఈ 12న తిరుపతి మహతి కళా క్షేత్రంలో జరిగే వే ఫౌండేషన్ 12వ వార్షికోత్స వం సందర్భంగా ఆయనకు అందజేస్తామని తెలిపారు.

గర్భిణులకు పీజీ డాక్టర్ వైద్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు సమ్మెలోకి వెళ్లడంతో తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్న డాక్టర్ మాధవి గురువారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య సేవలు చవక

బుచ్చినాయుడుకండ్రిగ: జీఎస్టీ తగ్గింపుతో మందుల ధరలు తగ్గడంతో పాటుగా ఆరోగ్య సేవలు చవకగా లభిస్తున్నాయని ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బందికి జీఎస్టీ తగ్గింపుపై గురువారం అవగాహన కల్పించారు. కార్యదర్శి పెంచలయ్య, ఉప సర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

పూరీ పర్యటనలో చందన స్రవంతి



సత్యవేడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) ఒడిశా రాష్ట్రం పూరీలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అమలు చేసిన 'సుజల్ డ్రింక్ ఫ్రం ట్యాప్ మిషన్' పథకాన్ని అధ్యయనం చేసేందుకు ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్. చందన స్రవంతి ఆ రాష్ట్రంలో పర్యటించారు. లండన్, న్యూయార్క్, సింగపూర్ వంటి నగరాల్లో లాగా మున్సిపల్ కుళాయిల నుంచి రోజంతా 24 గంటల పాటు నాణ్యమైన తాగునీటిని పూరీ నగరంలో ఒడిశా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఈ పథకాన్ని పరిశీలిం చేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బృందం పూరీలో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా అక్కడి మహిళలతో చందన స్రవంతి సమావేశమై పథకం తీరుతెన్నులు గురించి అడిగి తెలుసుకున్నారు.

కట్టపుట్టాలమ్మ ఆదాయం రూ.8లక్షలు

రేణిగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కట్టపుట్టాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. జూలై 23వ తేదీ నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీలో సమర్పించిన నగదును లెక్కించగా రూ.8లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ రాజేంద్ర తెలిపారు.

పుత్తూరు వార్తలు

ఒరిజినల్స్ చూసి డిజిటలైజ్ చేయండి

పుత్తూరు, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంకల్పించిన శాశ్వత కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీచేసే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లను సరిచూసి డిజిటలైజ్ చేయాలని డిజిటల్ అసిస్టెంట్లను పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. పురపాలక సంఘ పరిధిలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా మ్యుటేషన్లను పంపరాదన్నారు. డీటీ అశోక్‌రెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పట్టుబడిన వాహనం

పుత్తూరు అర్బన్: పుత్తూరు జాతీయ రహదారిలో బైక్‌ను ఢీకొని ఇద్దరు మృతికి కారణమైన వాహనాన్ని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్‌ను ఢీకొట్టి నిలపకుండా వెళ్లిన వాహనం తమిళనాడుకు రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగిన బొలెరోగా గుర్తించారు. కరివేపాకు లోడుతో చెన్నైకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆ వాహనం కోసం చెన్నై వెళ్లిన పోలీసులు డ్రైవర్‌ను అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



పుత్తూరు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద బాధితులకు చెక్కులు అందజేశారు. వడమాలపేట మండలం ఎస్వీ పురానికి చెందిన ప్రభాకర్ రూ.53,678, పుత్తూరుకు చెందిన పి.కె.గోవిందస్వామి రూ.1.04 లక్షల చెక్కు అందుకున్నారు. బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పొదుపు సంఘాలతో ఆర్థిక అభివృద్ధి

పుత్తూరు టౌన్, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రాస్ కార్యాలయంలో పొదు పు సంఘాల సలహా కమిటీ లీడర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నాగరాజు మాట్లాడుతూ పొదుపు సం ఘా ల సభ్యులు, వారి కుటుంబ సభ్యుల బలోపేతానికి ఎన్నో కార్యక్రమాలను రాస్ నిర్వహిస్తోందన్నారు. మహిళల జీవనోపాధికి ఆదాయ మార్గాల అవకా శాలను, అప్పులు పొందడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నగదు వినియోగంపై పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. క్లస్టర్ల కమిటీ లీడర్లు పాల్గొన్నారు.